సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



ఎస్‌జీఎఫ్ జిల్లా రగ్బీ జట్లు ఎంపిక
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) వైఎస్ఆర్ కడప జిల్లా రగ్బీ జట్లను శనివారం ప్రకటించారు. నందలూరు మండలం ఆడపూరులో ఎంపికలు నిర్వహించారు. -8లో



ఆకట్టుకున్న ఓపెన్ హౌస్
పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఆకట్టుకుంది. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.9/23.2

జిల్లాలో శనివారం 23.2 - 32.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

28న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు
కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ఈ నెల 28న ధర్నాలు చేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులు , క్లాప్ డ్రైవర్లు, డైలీ వేజ్ ఉద్యోగులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు పాల్గొన్ని ధర్నా జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయ భాస్కర్ జిల్లా కోశాధికారి గోపి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వైవీయూ సీఈగా ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. శనివారం పరీక్షల విభాగం కార్యాలయంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిలు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా ప్రైవేట్ మేనేజ్‌మెంట్ కళాశాలల అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలువురు కరస్పాండెంట్‌లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

డీఈఓకు ఘన సన్మానం



డీఈఓ మర్రెడ్డి అనురాధను సన్మానిస్తున్న సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు

కడప ఎడ్యుకేషన్: డీఈఓగా పనిచేసిన అనతి కాలంలోనే అందరి మన్ననలను పొందిన అధికారి మర్రెడ్డి అనురాధ అని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్ అన్నారు. డీఈఓ మర్రెడ్డి అనురాధ విజయవాడ రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి బదిలీపై వెళుతున్న నేపథ్యంలో శనివారం డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ, డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయ అధికా రులు, సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. అనంతరం ఆమెకు వీడ్కోలు పలికారు. డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కడప ఎంఈఓ గంగిరెడ్డి, విశ్రాంత ఎంఈఓ నారాయణ, సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్ మురళీమోహన్, ఆర్‌జేడీ, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

- కొత్త డీఈఓ వచ్చేంతవరకు ప్రొద్దుటూరు డిప్యూటీ ఈఓగా ఉన్న మీనాక్షి ఇన్‌చార్జ్ డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

వెలుగులకు చంద్ర గ్రహణం

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు 37 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వీటిలో జగనన్న కాలనీల్లో పేదలకు సౌకర్యం కోసం ప్రాధాన్యం
- రూ.60–70 కోట్ల వ్యయంతో 2023లోనే నిర్మాణ పనులు
- టీడీపీ అధికారంలోకి రావడంతో 32 సబ్‌స్టేషన్ల రద్దు
- టెండర్లు, ఒప్పందాలు జరిగినా బేఖాతర్



తాటిగుంటిపల్లెలో నిర్మాణంలోని 33/11 విద్యుత్ కేంద్రం

బి.కొత్తకోట: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పనులపై వివక్ష చూపుతోంది. అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన మెరుగైన సౌకర్యాలపై రాజకీయాలు ప్రేరేపితం అవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి, ఆర్థిక అసమానతలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ఇప్పటికే మంజూరైన, ఒప్పందాలు జరిగిన పనులను రద్దు చేస్తూ ప్రజలను సౌకర్యాలకు దూరం చేస్తోంది. మెరుగైన విద్యుత్ సరఫరా, లోఓల్టేజీ నివారణ, నిరంతరం విద్యుత్, సరఫరా నష్టాలను తగ్గించడం, పేదలున్న కాలనీలకు విద్యుత్ వెలుగులు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు మంజూరు చేసిన వాటిలో 32 విద్యుత్ సబ్‌స్టేషన్లు వెనుకా ముందు ఆలోచించకుండా రద్దు చేసేసింది.

ఒకేసారి 37 సబ్‌స్టేషన్లు
ప్రజలకు, జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉన్నతాధికారులకు పంపిన కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో కొత్తగా రూ.60–70 కోట్ల వ్యయంతో 37 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపట్టింది. ఈ నిర్ణయంతో మారుమూల పల్లెలు, జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు వెదజల్లడానికి అన్ని చర్యలు పూర్తి చేసింది. నిధులు మంజూరైన తొలి విడతలో 14 విద్యుత్ కేంద్రాలు పనులకు సిద్ధమయ్యాయి. రెండో విడతలో మిగిలిన కేంద్రాలకు అనుమతులు రావడంతో టెండర్లు నిర్వహించి పనులు అప్పగించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పూర్తయింది.

సమస్యలకు పరిష్కారం
రెండు జిల్లాల్లో కొత్తగా మంజూరై నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలు పూర్తయితే వినియోగదారులకు సరఫరా సమస్య ఉండబోదు. విద్యుత్ వినియోగదారులకు లోఓల్టేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారమై, అంతరాయాలకు చెక్ పడుతుంది. విద్యుత్ లైన్లు అధిక దూరంలో ఉండటం వల్ల సరఫరా నష్టాలతో సంస్థకు ఆదాయ పరంగా నష్టాలొస్తాయి. సబ్‌స్టేషన్ల సమీపం నుంచి సరఫరా లైన్లు ఉండటం వల్ల సరఫరా నష్టాలను అధిగమించవచ్చు. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, వైఫల్యం చెందడం తగ్గుతుంది. అలాగే జగనన్న కాలనీల్లో నిర్మించోయే సబ్‌స్టేషన్లతో కాలనీలకు నిరంతరం విద్యుత్ సరఫరాతో ఇబ్బంది కలగడకుండా సేవలు అందుతాయి.

ప్రభుత్వం వద్దనుకుంది
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మారుమూల పల్లెలకు మంజూరు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు అవసరం లేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ పనులు పూర్తి చేసేందుకు గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత ఎన్నికలు, కొత్త ప్రభుత్వం కొలువు కావడంతో పరిస్థితులు మారిపోయాయి. 37 సబ్‌స్టేషన్లలో పనులు జరిగిన ఐదింటిని మినహాయించి మిగిలిన వాటికి పనులు చేపట్టడం అవసరం లేదని తేల్చేసి రద్దు చేయడంతో పనులు మొదలు కాకుండానే ఆగిపోయాయి. కాగా ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్ల నుంచి ఉన్నతాధికారులు ఒప్పందాలు కూడా చేసుకున్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం అయిష్టత వ్యక్తం చేయడంతో పనులు చేసే అవకాశం లేకపోయింది.

ఆ ఐదు చోట్ల పనులు: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన చక్రాయపేట మండలం సుంకేసుల, సింహాద్రిపురం మండలం ఉక్కిసవాండ్లపల్లె, రామాపురం మండలంలోని చీమలచెరువుపల్లె, తాడిగుంటపల్లె, బోయపల్లెల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటిదాకా జరిగిన పనుల్లో సాంకేతికపరమైన పనులు మినహా మిగతా పనులు పూర్తి కావడంతో సాంకేతిక పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించారు. కాంట్రాక్టర్లు పనులు చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉండగా డిస్కం అధికారులు నోటీసులు జారీ చేసి పనులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఔను.. రద్దయ్యాయి
వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు గత ప్రభుత్వం మంజూరు చేసిన 33/11 విద్యుత్ కేంద్రాలు రద్దయ్యాయని ఈ జిల్లాలకు చెందిన డిస్కం ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఐదుచోట్ల పనులు జరగడంతో వాటిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అందిన సూచన మేరకు చర్యలు తీసుకున్నామన్నారు. మంజూరై రద్దయిన సబ్ స్టేషన్ల విషయంలో ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టమైన సూచనలు అందలేదని పేర్కొన్నారు.

వైఎస్సార్ జిల్లాలో రద్దయినవి
పులివెందుల జగనన్న కాలనీ
కడప మామిళ్లపల్లె,
నానాపల్లె,
మైదుకూరు వైఎస్సార్ జగనన్న కాలనీ
కుడాలి
కమ్మవారిపల్లె
ప్రొద్దుటూరు మీనాపురం
పులివెందుల చిలేకాంపల్లి
ఉడవగండ్ల
లోపట్నూతల
రాంనూతనపల్లె
వలిమెల్ల
రామేశ్వరం జగనన్న కాలనీ
బొల్లవరం జగనన్న కాలనీ
పైడిపాలెం
కొత్తగంగిరెడ్డిగారిపల్లె
గొందిపల్లె

అన్నమయ్య జిల్లాలో..
రెడ్డివారిపల్లె
బాలపల్లె
గొబ్బూరువారిపల్లె
నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీ
ఆరవీడు
రామాపురం
పాతకోట
పులికల్లు
మద్దినాయునిపల్లె
బి.కొత్తకోట ఇందిరమ్మ కాలనీ
దిన్నిమీదపల్లె
దండువారిపల్లె
మట్లివారిపల్లె
బాలయ్యగారిపల్లె
సరిమడుగు

శిలాఫలకంపై పేర్లు తొలగింపు



శిలాఫలకంపై పేర్లు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కడప ఎడ్యుకేషన్: కడప అంధుల ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల వేళ పాఠశాల ఆవరణలో 26వ తేదీన ఆవిష్కరించునున్న శిలాఫలకంలో నగర ప్రథమ పౌరుడు మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్లు లేకపోవడంపై శుక్ర వారం సాక్షిలో 'ప్రోటోకాల్ ఉల్లంఘన' శీర్షికన వార్తకు అధికారులు స్పందించారు. శనివారం శిలాఫలకంపై పేర్లు తొలగించారు.

ఉచిత శిక్షణ
కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో 30 రోజులపాటు, జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజులపాటు నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తారని సంస్థ ప్రతినిధి ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 20 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. అభ్యర్థులు 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ



ప్రతిజ్ఞ చేస్తున్న నూతన వైద్య విద్యార్థులు

కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, అంకితభావంతో వైద్య విద్యను నేర్చుకుని సేవాభావంతో వైద్య సేవలను అందించాలని, అపుడే ఆ వైద్యుడి భవిష్యత్తు బాగుంటుందని కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. 2024–25 బ్యాచ్ నూతన వైద్య విద్యార్థులకు శనివారం కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో 'వైట్ కోట్'లను ధరింపచేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వారిచేత వైద్య విద్యకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ వైద్య వృత్తి పట్ల అంకిత భావంతో వుండి, నిత్యం విద్యార్థిలాగా భావిస్తూ వైద్యవిద్యలో నైపుణ్యాన్ని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర అధికారులు నూతన వైద్య విద్యార్థులకు లాంఛనంగా వైట్ కోట్‌లను ధరింపచేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్య అధ్యాపకులు, నూతన వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు
కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 27వ తేదీ ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు ఎస్. రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

హెడ్ కానిస్టేబుల్ వి.ఎం బాషా సస్పెన్షన్
కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఓ స్థలం విషయమై కొందరు నిందితులతోపాటు హెడ్ కానిస్టేబుల్ వి.ఎం బాషాపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వి.ఎం బాషాను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

నేడు హైదరాబాద్‌కు విమాన సర్వీసు ప్రారంభం
కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నుంచి హైదరాబాద్‌కు ఆదివారం విమాన సర్వీసును ప్రారంభించనున్నట్లు కడప విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రయాణీకులు నూతన సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్‌బీఐ ప్రదర్శనలో ఏఎఫ్‌యూ విద్యార్థి ప్రతిభ



హరినాయక్‌ను అభినందిస్తున్న ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, అధ్యాపకులు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం బీఎఫ్ఏ పెయింటింగ్ తృతీయ సంవత్సరం విద్యార్థి వి. హరినాయక్ చక్కటి ప్రతిభ కనబరిచారు. రిజర్వ్ బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన పోటీల్లో జాతీయ, జోనల్, రాష్ట్రస్థాయి పోటీల్లో ఈయన పాల్గొన్నాడు. గతనెల 30వ తేదీన నిర్వహించిన కాంపిటీషన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థిగా గుర్తింపు పొందాడు. ఈనెల 23వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించిన ఆర్‌బీఐ నేషనల్ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 71 కళాఖండాలు కాగా అందులో హరినాయక్ గీచిన చిత్రానికి చోటు దక్కింది. దీంతో ఈయనకు ఆర్‌బీఐ వారు ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్, తదితరులు విద్యార్థిని అభినందించారు.

'కేఎస్ఆర్ఎం'కు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్



విజయోత్సవ సంబరాల్లో కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, కందుల మదన్ మోహన్‌రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: అఖిల భారత విద్యా ప్రమాణాల మండలి (యూజీసీ న్యాక్) కడపలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలకు ఏ ప్లస్ గ్రేడ్ ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. దీనిని పురస్కరించుకుని శనివారం కళాశాలలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2024 అక్టోబర్ నుండి 2029 అక్టోబర్ వరకు ఏ + గ్రేడ్ కళాశాలకు అమలులో ఉంటుందని తెలిపారు. ఇది కళాశాల విద్యా ప్రమాణాలు, పరిశోధన, శిక్షణలో చూపిన అంకిత భావానికి గుర్తింపు అన్నారు. ఈ విజయానికి ముఖ్య కారకులు తమ విద్యాసంస్థ అధినేతలు డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, వైస్ చైర్మెన్ కందుల మదన్ మోహన్ రెడ్డి అన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ అండ్ ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన వారందరినీ అభినందించారు. ఈ విజయోత్సవంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.ఎన్ ప్రసాద్, డీన్‌లు , వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు

సింహాద్రిపురం : సింహాద్రిపురం మండలం నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన వై.వెంకట మహేశ్వరరెడ్డిపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి ఘటపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎస్‌ఎండీ షరీఫ్ శనివారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదే గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరుసుకు రావాలని ఎంపీకి ఆహ్వానం



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న పీఠాధిపతి, ఇతర దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కడప పెద్దదర్గా ఉరుసు రావాలంటూ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ కోరారు. శనివారం ఎంపీని తన అనుచరులతో ఆయన కార్యాలయంలో కలిసిన పీఠాధిపతి నవంబరు 16 నుంచి అత్యంత భారీగా జరగనున్న పెద్దదర్గా ఉరుసు ఉత్సవాలకు తప్పక హాజరు కావాలని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల వివరాలుగల ఆహ్వానపత్రికను అందజేశారు. వీరితోపాటు ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డిని కూడా ఆహ్వానించారు.

పింఛా ప్రాజెక్టును సందర్శించిన ఎస్ఈ

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టును జల వనరులశాఖ ఎస్ఈ శ్రీనివాసులు శనివారం సందర్శించారు. గత వారంలో కురిసిన తుపానుకు డ్యామ్‌లోకి వర్షం నీరు రావడంతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. 2021 నవంబర్ నెలలో భారీ వరదలు కారణంగా తెగిపోయిన పింఛా డ్యామ్‌కు గత ప్రభుత్వం మరమ్మతులు చేయించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డ్యామ్‌లోకి వరద నీరు వచ్చింది. ప్రస్తుతం 164 క్యూసెక్కుల నీరు డ్యామ్‌లో ఉండగా రైతులు వ్యవసాయానికి కుడి కాలువలో 40 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువలో 30 క్యూసెక్కుల నీటిని ఎస్ఈ శ్రీనివాసులు విడుదల చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఈ చెంగల్ రాయుడు, ఏఈ నాగేంద్ర నాయక్, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్



పోలీసుల ఆయుధాల గురించి వివరిస్తున్న సిబ్బంది



విద్యార్థులతో కలిసి ఓపెన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

- ఎగ్జిబిషన్‌లో పోలీసు ఆయుధాల ప్రదర్శన
- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేయడానికి ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓపెన్ హౌస్‌లో భాగంగా బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూమ్, కమ్యూనికేషన్స్, ఆయుధాల విడిభాగాలు (ఏకే 47 , విల్ పిస్టల్, గ్లో 17, కార్బన్ , ఇన్సాస్ రైఫిల్, గ్యాస్ గన్, గ్రేనేడ్, ఫోరెన్సిక్ , ఆర్ఎఫ్ ఎస్ఎల్) తదితర విషయాల గురించి జిల్లా ఎస్పీ వివరించారు. బాడీ వర్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్ఎఫ్ సెట్, రోబో డ్రెస్, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ప్రదర్శనలో ఉంచారు.

ప్రత్యేక ఆకర్షణగా పోలీసు జాగిలాలు

నేర పరిశోధనలో ఉపయోగించే డాగ్ స్క్వాడ్ బృందంలో ఇటీవల నూతనంగా చేరిన దయానా, రూబీలతో పాటు లూసీ ప్రత్యేక ఆకర్షణగా ఈ ప్రదర్శనలో నిలిచాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్ బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి, శివరాముడు, టైటస్, నగరంలోని సీఐలు, ఆర్ఎస్ఐలు, నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

వీరజవాన్ అంతిమ సంస్కారానికిచ్చే గౌరవం ఇదేనా?



మాట్లాడుతున్న మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షులడు వీకే విశ్వనాథ్

కడప రూరల్ : చత్తీస్‌ఘడ్‌లో మావోయిస్టుల దాడిలో వీర మరణం పొందిన కొడవగంటి రాజేష్ అంతిమ సంస్కారానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు కాకపోవడం దారుణమని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వీకే విశ్వనాథ్ మాదిగ తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వీర జవాన రాజేష్ కుటుంబ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.మఠం మండలం పాపిరెడ్డిగారిపల్లెకు చెందిన కొడవగంటి రాజేష్ (36) చత్తీస్‌గడ్‌లో విధి నిర్వహణలో మావోయిస్టులు పేల్చిన మందుపాతరకు మృతి చెందాడన్నారు. ఆయన మృతదేహాన్ని సైనిక ఉన్నతాధికారులు స్వగ్రామానికి తీసుకు రావడం అభినందనీయమన్నారు. అయితే వీర మరణం పొందిన రాజేష్ అంతిమ సంస్కారానికి జిల్లా కలెక్టర్, ఎస్పీతోపాటు స్థానిక మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తదితరులు హాజరు కాకపోవడం దారుణమన్నారు. ఒక వీర సైనికునికి ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. రాజేష్‌తోపాటు ముగ్గురు సైనికులు చనిపోతే అంతిమ సంస్కారానికి స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు గవర్నర్ తదితర ఉన్నతాధికారులు హాజరై మృతుల కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. ఇక్కడ మాత్రం రాజేష్‌ను ఒక మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా భావించి దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. ఆ కుటుంబానికి రూ. కోటికి తగ్గకుండా ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, కోరుకున్న చోట్ల ఐదు సెంట్ల ఇంటి స్థలం, సైనిక్ స్కూలులో పిల్లల చదువులకు చర్యలు తీసుకోవడంతోపాటు రాజేష్ భార్య స్వాతికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

ఎన్‌జీఎఫ్ జిల్లా రగ్బీ జట్లు ఎంపిక



జిల్లా బాలికల జట్టు



జిల్లా బాలుర జట్టు

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) వైఎస్సార్ కడప జిల్లా రగ్బీ జట్లను శనివారం ప్రకటించారు. నందలూరు మండలం ఆడపూరు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రెసిడెన్షియల్ పాఠశాల క్రీడామైదానంలో రగ్బీ అండర్-17, అండర్-14 బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలను వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా క్రీడాకారులు బాగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్‌కిరణ్, గణేష్, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

అండర్-14 బాలుర జట్టు : పునీత్‌రాజ్, అతుల్‌రెహమాన్, హాజిబుల్ రెహమాన్, మనోజ్, హర్షవర్ధన్, శివప్రసాద్‌నాయక్, మనోజ్, హేమంత్, నూరుల్లా, దేవరాజు, రెడ్డయ్య, నరేష్.

అండర్-17 బాలుర జట్టు : ఓబులేసు, వరుణ్, అశ్వక్‌హుస్సేన్, దిలీప్‌కుమార్, శివధనుష్‌రెడ్డి, కిరణ్‌సాయి, రాజేష్‌కుమార్, సుబ్రమణ్యం, సాయిరాంకృష్ణ, హర్షవర్ధన్, కార్తీక్, నరసింహ.

అండర్-14 బాలికలు : భారతి, అలేఖ్య, దీక్షిత, నీరజ, గీతిక, శ్రీవాణి, తేజశ్రీ, సంధ్య, హృదయ సారధి, ప్రత్యూష, రచనశ్రీ, స్నేహ.

అండర్-17 బాలికలు : స్పందన, భారతి, ఆయేషా, అనూష, నందిని, ఫర్హాన, గౌతమి, ఆఫియా, చందనప్రియ, మణిమాల, మేఘశ్రీ, లక్ష్మిస్పందన.

మోటర్ బైకును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

ప్రమాదంలో కొడుకు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు



మృతి చెందిన బాల గంగాధరరెడ్డి



తీవ్రంగా గాయపడిన వెంకట రమణారెడ్డి

వేంపల్లె : స్థానిక గండి రోడ్డులోని మూలవంక సమీపంలో శనివారం మోటర్ బైకును ఇసుక ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు, స్థానికుల మేరకు వివరాలు ఇలా.. వీరపునాయునిపల్లె మండలంలోని మొయిళ్ళ చెరువు గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డి, కొడుకు బాల గంగాధర్ రెడ్డి (45) కలసి వారికి ఉన్న రెండు ఎకరాలు పొలంలో వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. పాడి ఆవులు పెట్టాలన్న ఉద్దేశంతో ఆవులు కొనుగోలు చేసేందుకు శనివారం మొయిళ్ళ చెరువు గ్రామం నుంచి చక్రాయపేటకు తండ్రీకొడుకులిద్దరూ మోటర్ బైకు(బుల్లెట్)పై బయలుదేరారు. వేంపల్లెలోని గండి రోడ్డులో ఉన్న మూలవంక సమీపంలోకి రాగానే నందిపల్లె గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్ అతి వేగంగా బైకును ఢీకొంది. ప్రమాదంలో బాల గంగాధర్ రెడ్డికి బలంగా దెబ్బ తగలడంతో అక్కడక్కడే మృతి చెందాడు. మోటర్ బైకులో వెనుక కూర్చొన్న వెంకట రమణారెడ్డికి ఎడమ కాలు విరిగిపోయింది. మోటర్ బైకును ఢీకొన్న ఇసుక ట్రాక్టర్ నిలపకుండా వెళ్లిపోయింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో తీవ్రంగా గాయపడిన వెంకట రమణారెడ్డిని వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే వారి బంధువులకు సమాచారమిచ్చారు. మృతుడికి భార్య జ్యోతితోపాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాల గంగాధరరెడ్డి మృతదేహాన్ని వేంపల్లె ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

29, 30న డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు

ప్రొద్దుటూరు : డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను ఈనెల 29, 30వ తేదీల్లో కడపలో నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. శనివారం ప్రొద్దుటూరులో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ సమావేశాల్లో కడప ఉక్కుఫ్యాక్టరీ, రాష్ట్ర విభజన హామీలు అమలే అజెండాగా తీసుకుని చర్చిస్తారని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై కేంద్రం నిర్లక్ష్యం చేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కడప కొప్పర్తి పారిశ్రామిక కారిడార్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని అమరావతికి తరలించడ అన్యాయం అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్ రాజ్, విశ్వనాథ్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రికి చెందిన ముత్తుముల జయరామిరెడ్డికి చెందిన గేదె శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. జయరామిరెడ్డి ఉదయాన్నే గేదెలను మేతకు తోలుకు వెళుతుండగా గ్రామంలోని సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ప్రమాదంతో అక్కడిక్కడే మృతి చెందింది. రూ.60 వేల విలువ చేసే గేదె మృతి చెందిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

సేద్య పరికరాల అమరికపై అవగాహన

– సూక్ష్మనీటి సాగు పథక జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మురళీమోహన్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ రైతుల పంట పొలాలకు ఏర్పాటు చేసే బిందు, తుంపర సేద్య పరికరాల అమరికలో ఎటువంటి లోపాలు లేకుండా ఎలా ఏర్పాటులో సూక్ష్మనీటి సాగు పథక జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మురళీమోమన్‌రెడ్డి అవగాహన కల్పించారు. శనివారం కడప కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపి కార్యాలయంలో బిందు, తుంపర సేద్య పరికరాల అమరికపై గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 29.300 హెకార్టకు బిందు, తుంపర సేద్య అమలుకు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. క్షేత్రస్థాయిలో నాణ్యతగా పని చేస్తేనే మన సేవలు రైతులు పూర్తిగా పొందగలరని పిట్టర్స్‌కి సూచించారు. పరికరాల అమరికలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమాన్ని పిట్టర్స్ శ్రద్ధగా వినియోగించుకుంటే క్షేత్రస్థాయిలో ఉపయోగపడుతుందని సూచించారు. అగ్రానమిస్ట్ రమణారెడ్డి పిట్టర్స్‌కి రైతు పొలాల్ల పరికరాలను ఏ విధంగా బిగించాలో తెలియజేశారు. అలాగే పరికరాల నిర్వహణ, పరికరాల ఉపయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఐ ఇంజనీర్లు, యంఐడిసిలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, పోలీసు సిబ్బంది


కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు సిబ్బంది, పోలీసు ఉద్యోగుల పిల్లలకు జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం వక్తృత్వ, వ్యాస రచన పోటీలను అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. పోలీసు ఉద్యోగులకు 'ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై, పోలీసు ఉద్యోగుల పిల్లలకు 'సైబర్ నేరాల నిరోధంలో యువత పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్స్‌ను అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అందచేస్తారని ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆర్.ఐ ఆనంద్, ఆర్.ఎస్.ఐ కె. వెంకటేశ్వర్లు, మహిళా ఆర్.ఎస్.ఐ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

బద్వేలు అర్బన్ : గోపవరం మండలం శ్రీనివాసపురం గ్రామంలో ఈ నెల 22వ తేదీన తన చిన్నాన్న అయిన తిప్పిరెడ్డివెంకటసుబ్బారెడ్డిని హత్య చేసిన తిప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసినట్లు బద్వేలు రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు. స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీనివాసపురం గ్రామానికి చెందిన తిప్పిరెడ్డిభాస్కర్‌రెడ్డి గత పదేళ్లుగా తాగుడుకు బానిస అవడంతో పాటు తనకు పెళ్లి చేయలేదనే కారణంతో తల్లిదండ్రులను వేధిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 22వ తేదీన రాత్రి సమయంలో ముద్దాయి ఇదే మాదిరిగా తన తల్లి అయిన తిరుపతమ్మను వేధిస్తుండటంతో ఆమె సమీపంలోని తన సోదరి, వెంకటసుబ్బారెడ్డి భార్య అయిన విజయలక్ష్మి ఇంటికి వెళ్లి తల దాచుకుంది. విషయం తెలుసుకున్న భాస్కర్‌రెడ్డి తన చిన్నాన్న ఇంటి వద్దకు వెళ్లి తన తల్లిని బయటకు పంపమని గొడవ చేశాడు. అలాగే ఇంటి వద్దకు వెళ్లిన ప్రతిసారి చిన్నాన్న తనను తాగుబోతు అని తిడుతూ ఉండటం, మూడు నెలల క్రితం చెంప మీద కొట్టడం వంటి ఘటనలు దృష్టిలో ఉంచుకుని అతనిపై కక్ష కట్టి కత్తెరతో హత్యచేసి అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు నిందితుడి కోసం గాలిస్తుండగా శనివారం నెల్లూరురోడ్డులోని జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకుని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటారు తీగల చోరీ

– ఆరు గ్రామాలలో అపహరించిన దొంగలు



మోటార్ వద్ద విద్యుత్ తీగలు కత్తిరించిన దృశ్యం

దువ్వూరు(చాపాడు) : దువ్వూరు మండల పరిధిలోని ఆరు గ్రామాలలో శుక్రవారం అర్ధరాత్రి రైతుల పొలాల్లో ఉండే విద్యుత్ వ్యవసాయ మోటార్ల వైర్లను దొంగలు అపహరించారు. మండలంలోని మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, చల్లబసాయపల్లె, మనేరాంపల్లె, గుడిపాడు, పెద్ద సింగనపల్లె గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పంట పొలాల్లో ఉండే వ్యవసాయ విద్యుత్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని దొంగలు కత్తిరించుకుని ఎత్తుకుపోయారు. ఆరు గ్రామాల పరిధిలోని పంట పొలాల్లో 50 వ్యవసాయ మోటార్లకు చెందిన విద్యుత్ తీగలను కత్తిరించుకుపోయినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. ఒక్కో మోటార్‌కు ఉండే విద్యుత్ తీగల విలువ రూ.4వేల వరకూ అవుతుందన్నారు. గతంలో కూడా ఇలాంటి దొంగ తనాలు పలు సార్లు జరిగాయని రైతులు వాపోతున్నారు. చిన్నసింగనపల్లె, చల్లబసాయపల్లె, మనేరాంపల్లె గ్రామాలలో గత మూడు నెలల వ్యవధిలో మూడు సార్లు ఇలాంటి సంఘటనలు జరిగాయని అప్పట్లో పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా పోలీసులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గురయ్య (ఫైల్)


కలసపాడు : మండలంలోని పిడుగుపల్లె వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లారెడ్డిపల్లెకు చెందిన గుడిమె గురయ్య(27) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గురయ్య గోపవరం మండలంలోని సెంచూరీ ప్లైవుడ్ ఫ్యాక్టరీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా పిడుగుపల్లె వద్ద కేబుల్ అమరికకు తీసిన గుంత వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. ఇతనికి ఐదు నెలల కిందట పోరుమామిళ్ల మండలంలోని కవలకుంట్లకు చెందిన యువతితో వివాహమైంది. చేతికందిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, భార్య తీవ్ర విషాదంలో మునిగారు. మృతుని తండ్రి పెద్ద గురప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

– 8 మందికి ఒక్కొరికి రూ.10,500లు జరిమానా

రాయచోటి టౌన్ : పట్టణంలో వివిధ ప్రాంతాలలో డ్రంక్ డ్రైవ్ కేసు నిందితులు నలుగురికి ఒక్కొరికి నెల రోజుల జైలు శిక్ష, మరో ఎనిమిది నిందితులకు ఒకొక్కరికి రూ.10,500 జరిమానాను రాయచోటి సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆసీఫా సుల్తానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. శనివారం కోర్టు ముందు హాజరు పెట్టగా ఈ శిక్షలు అమలు చేసినట్లు తెలిపారు. రెండు రోజులుగా రాయచోటి పట్టణ, శివార్లలో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తేలిందని చెప్పారు. మద్యం తాగి వాహనలు నడిపిన వారిలో షేక్. ఆరీఫ్, దాసరి వినోద్, షరీఫ్, సయ్యద్‌చాన్‌బాషలకు కోర్టు మెజిస్ట్రేట్ ఒకొక్కరికి నెల రోజులు జైలు శిక్ష విధించారు. అలాగే షేక్. రహంతుల్లా, దేరంగుల వెంకట శివ, దుర్గం నాగేశ్వర్, జూలపల్లె రహంతుల్లా, ఎద్దులపల్లె రెడ్డికుమార్, గోగుల వాసుదేవ, షేక్ .మౌలానా, దేరంగుల నాగేంద్రలకు ఒక్కొక్కరికి రూ.10,500లు జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యంగా తాగి వాహనాలు నడపరాదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

సీడీపీఓను సస్పెండ్ చేయాలని ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీ వర్కర్లను వేధిస్తున్న కడప సీడీపీఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కడప నగరంలోని సున్నపుబట్టీలు సెంటర్‌లో పర్యవేక్షణ పేరుతో అంగన్వాడీ వర్కర్లను సీడీపీఓ బెదిరించడం వల్ల ఆమె అనారోగ్యానికి గురైందని యూనియన్ గౌరవాధ్యక్షులు మనోహర్ తెలిపారు. గర్భిణులు, బాలింతలకు కాలం చెల్లిన పౌష్టికాహారం అందించిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అంజలీదేవి, లక్ష్మిదేవి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.